క్లుప్తంగా

విరాసత్‌పై ఆర్డీవో విచారణ



విచారణ చేస్తున్న ఆర్డీవో రమేశ్‌బాబు

శంకరపట్నం: తప్పుడు పత్రాలతో విరాసత్ చేశారనే ఫిర్యాదు మేరకు హుజూరాబాద్ ఆర్డీవో రమేశ్‌బాబు బుధవారం మొలంగూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో విచారణ చేశారు. మండలంలోని మొలంగూర్ గ్రామ పంచాయతీ పరిధి నల్లవెంకయ్యపల్లెకు చెందిన పొద్దుటూరి వీరారెడ్డి ఆరునెలల క్రితం చనిపోయాడు. ఆయన భార్య జమున 30 ఏళ్లుగా విడిగా ఉంటోంది, వీరారెడ్డి అనారోగ్యానికి గురికాగా అక్కలు, తమ్ముడు హైదరాబాద్, కరీంనగర్ ఆస్పత్రిలో వైద్యం చేయించారు. అక్కలు, తమ్ముడు వైద్యం కోసం రూ.15లక్షలు ఖర్చు పెట్టినా ఆయన ప్రాణాలు దక్కలేదు. ముప్పై ఏళ్లుగా తల్లిశంకరమ్మతో ఉంటున్న వీరారెడ్డిని చనిపోయే ముందు జమున, కూతుర్లు ఆస్పత్రికి వచ్చి చూశారని, చనిపోయాక కూతుళ్ల పేరిట వీరారెడ్డికి చెందిన 2.30 ఎకరాల భూమిని విరాసత్ చేయించారని దాన్ని రద్దు చేసి తల్లి శంకరమ్మపేరిట మార్చాలని మృతుడి అక్కలు ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. జమున గోదావరిఖనిలో తొమ్మిదేళ్లుగా వితంతు పెన్షన్ తీసుకుంటున్నట్లు ఆధారాలను విచారణ అధికారి ఆర్డీవోకు అందజేశారు. జమునను విచారించిన ఆర్డీవో పూర్తి వివరాల నివేదికను కలెక్టర్‌కు అందిస్తానని స్పష్టం చేశారు.

విద్యార్థులపై శ్రద్ధ పెట్టాలి

హుజూరాబాద్‌రూరల్: విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని జిల్లా విద్యాశాఖాధికారి సీహెచ్.ఎస్. జనార్దన్‌రావు అన్నారు. మండలంలోని పెద్దపాపయ్యపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. ముఖ్యమంత్రి, ఎస్పీ, కలెక్టర్, డీఈవో, ఎంఈవోల పేర్లను అడిగి తెలుసుకున్నారు. ప్రతి టీచర్ విద్యార్థులను దత్తత తీసుకొని వారు ఎలా చదువుతున్నారో చూస్తూ అన్ని రంగాల్లో రాణించేలా ప్రోత్సహించాలన్నారు. చదువు రాకపోతే రాబోయే కష్టాలను తెలియజేయాలన్నారు. భాషా ఉపాధ్యాయులే కాకుండా సబ్జెక్టు ఉపాధ్యాయులు విద్యార్థుల దత్తతపై శ్రద్ధ చూపాలన్నారు. చదువులో చురుకైన విద్యార్థులకు కింది తరగతి విద్యార్థులను అటాచ్ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో చిల్లప్ప అనురాధ, బేతి తిరుపతిరెడ్డి, ఆవుల పద్మశ్రీ, ఆవుల వెంకటరమణ, ఇర్రి శ్రీనివాస్‌రెడ్డి, రమేష్‌బాబు, సత్యానందం తదితరులు ఉన్నారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్ వినియోగించుకోవాలి


చొప్పదండి: ఓపెన్ టెన్త్, ఒకే సంవత్సరంలో ఓపెన్ ఇంటర్ పూర్తి చేసే అవకాశాన్ని అర్హులైన వారు ఉపయోగించుకోవాలని మండలంలోని రుక్మాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు ఉమాదేవి కోరారు. అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని, పైచదువులు, ప్రమోషన్లకు అర్హత లభిస్తుందని తెలిపారు. వివరాలకు పాఠశాల జీ సంప్రదించాలన్నారు.

మండల స్థాయి క్రీడాపోటీలు

మానకొండూర్‌రూరల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో సెప్టెంబర్ 3, 4 తేదీల్లో మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు నిర్వహించనున్నామని ఎంఈవో మధుసూదనాచారి తెలిపారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

వీణవంక: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సెప్టెంబర్ 3 నుంచి 6వ తేదీ వరకు మండల స్థాయి క్రీడోత్సవాలు నిర్వహించనున్నట్లు మండల విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి బుధవారం ప్రకటనలో తెలిపారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ సెలక్షన్స్ జరుగుతాయని, క్రీడల్లో పాల్గొనే విద్యార్థులు బోనాఫైడ్, జనన ధ్రువీకరణపత్రం సమర్పించాలన్నారు. వివరాలకు పీడీ మొబైల్ నంబర్ 9346120205 సంప్రదించాలన్నారు.

సేఫ్టీ కిట్‌పై అవగాహన



చిగురుమామిడి: మండలంలోని ఆయా గ్రామాల్లో ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో కాటమయ్య రక్షణ కవచం శిక్షణ నిర్వహించారు. బుధవారం గ్రామంలోని గౌడ సంఘం నాయకులు పాల్గొని రక్షక కవచంతో తాటి చెట్లను విజయవంతంగా ఎక్కారు. కల్లు గీసేందుకు ప్రతి గీత కార్మికుడు తప్పనిసరిగా సేఫ్టీ కిట్టు ఎలా ఉపయోగించాలో ట్రైనర్లు జశ్వంత్, బుచ్చయ్య వివరించారు. మిగతా గ్రామాల్లో కూడా గీత కార్మికులు సేఫ్టీ కిట్టు ఉపయోగించి శిక్షణ పొందారు. కార్యక్రమంలో తిమ్మాపూర్ ఎక్సైజ్‌శాఖ ఎస్సై శ్రీకాంత్, కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు తిరుపతి, గౌడ సంఘం మండల శాఖ అధ్యక్షుడు చంద్రయ్యగౌడ్, నాయకులు సంపత్, తిరుపతి, మల్లేశం, శ్రీనివాస్, మొగిలి, జిల్లా నాయకులు తోడేటి శ్రీనివాస్, రాజు, చిన్నచంద్రయ్య పాల్గొన్నారు.

ఓటరు జాబితాపై అవగాహన



తిమ్మాపూర్: మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ లక్ష్మీకిరణ్

తిమ్మాపూర్: ఓటరు జాబితాపై మండల పరిషత్ కార్యాలయంలో బీఎల్‌వోలకు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అడిషనల్ కలెక్టర్ లక్ష్మీకిరణ్ హాజరై మాట్లాడారు. 2025 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండే వారందరినీ ఓటరు జాబితాలో నమోదు చేయాలని, పట్టణాల్లో ఓటు హక్కు కలిగి ఉన్నవారిని గ్రామాల్లో ఓటరుగా నమోదు చేయొద్దని సూచించారు. ఓటరు నమోదుకు ఇంటింటా సర్వే చేయాలని తెలిపారు. మరణించిన వారి పేర్లు ఓటరు జాబితా నుంచి తొలగించాలన్నారు. చిరునామా మార్పు తప్పుల సవరణకు కూడా ఈసీ అవకాశం కల్పించిందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్, ఎంపీడీవో విజయ్ కుమార్, బీఎల్వోలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ రాజేశ్వరీ

మానకొండూర్‌రూరల్: మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఆయా రాజకీయ పార్టీల నాయకులతో మండల అధికారులు స్థానిక సంస్థల ఎన్నికలపై అవగాహన సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ రాజేశ్వరీ మాట్లాడుతూ.. ఓటరు నమోదు ప్రక్రియ వేగవంతంగా జరుగుతుందని, ఏమైనా మార్పులు చేర్పులు ఉంటే సంబంధిత బీఎల్‌వోల వద్ద సరిచేసుకోవాలన్నారు.

రైతు ఉత్పత్తి కేంద్రం సందర్శన



మాట్లాడుతున్న ట్రైనీ కలెక్టర్ అజయ్‌యాదవ్

మానకొండూర్‌రూరల్: మండలంలోని రైతు ఉత్పత్తిదారుల కేంద్రాన్ని బుధవారం ట్రైనీ కలెక్టర్ అజయ్‌యాదవ్ పరిశీలించారు. ఈసందర్భంగా ఉత్పత్తి కేంద్రంలో జరుగుతున్న పనులు, రైతుల సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీఏఓ భాగ్యలక్ష్మి, ఏఓ శ్రీనివాస్‌రెడ్డి, రైతులు, పాల్గొన్నారు.

కుర్చీలు మార్పిడి

శంకరపట్నం: మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పలువురి కుర్చీలు మార్పిడి చేశారు. జెడ్పీటీసీ పదవీకాలం ముగియడంతో ఆయన గదిలోని కుర్చీ ఖాళీగా ఉండగా ఇటీవల బదిలీపై వచ్చిన సూపరింటెండెంట్ గదిలోకి జెడ్పీటీసీ కుర్చీ, జెడ్పీటీసీ గదిలో కుర్చీ సూపరింటెండెంట్ టేబుల్ వద్దకు వచ్చింది. దీన్ని గమనించిన ప్రజలు అధికారులకు చెప్పడంతో మళ్లీ ఎక్కడి కుర్చీలు అక్కడికి మార్పిడి చేశారు.

సమస్యలను పరిష్కరిస్తాం



సమస్యలు తెలుసుకుంటున్న చైర్మన్, కమిషనర్

జమ్మికుంట: మున్సిపల్ పరిధిలోని 22వ వార్డులో రోడ్డు, డ్రైనేజీతోపాటు పలు సమస్యలను మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు, కమిషనర్ ఆయాజ్‌తో కలిసి బుధవారం పరిశీలించారు. బీఆర్‌ఎస్ వార్డు అధ్యక్షుడు మంద రాజేశ్ వార్డులోని సమస్యలను చైర్మన్, కమిషనర్ దృష్టికి తీసుకుపోగా వెంటనే స్పందించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ... సమస్యలను త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వార్డు ప్రజలు, యువకులు పాల్గొన్నారు.

నేటి నుంచి రుణమాఫీపై స్పెషల్ డ్రైవ్



శంకరపట్నం: ఏఈవోకు దరఖాస్తు ఇస్తున్న రైతులు

గంగాధర: మండలంలో రుణమాఫీ గ్రామాల వారీగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నామని వ్యవసాయ అధికారి శ్రీనివాస్ తెలిపారు. గురువారం కాచిరెడ్డిపల్లి, కొండాయిపల్లి, చర్లపల్లి(ఆర్), ర్యాలపల్లి, 30న బూర్గుపల్లి, లింగంపల్లి, నర్సింహులపల్లి, సర్వారెడ్డిపల్లి, ముప్పిడి నర్సింహులపల్లి, 31న కొండన్నపల్లి, మంగపేట, ఇస్లాంపూర్, వెంకటాయిపల్లి, సెప్టెంబర్ 2న మల్లాపూర్, గోపాల్‌రావుపల్లి, వెంకంపల్లి, ఉప్పరమల్యాల, 3న నాగిరెడ్డిపూర్, నారాయణపూర్, లక్ష్మీదేవిపల్లి, చర్లపల్లి(ఎన్), 4న గంగాధర, కురిక్యాల, 5న హిమ్మత్‌నగర్, రంగరావుపల్లి, తాడిజర్రి, కాసారం, 6న గట్టుభూత్కూర్, గర్శకుర్తి, 9న ఆచంపల్లి, చిన్నాఆచంపల్లి, ఒద్యారం, 10న మధురానగర్ గ్రామంలో వ్యవసాయ అధికారులు వివరాలు సేకరిస్తారని పేర్కొన్నారు.

చొప్పదండి: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రుణమాఫీలో వ్యవసాయశాఖకు అర్హుల జాబితా వచ్చి ఇంకా రుణమాఫీ కాని వారి కుటుంబాల వివరాలపై గురువారం నుంచి వారం రోజుల పాటు గ్రామాల్లో సర్వే నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి వంశీకృష్ణ తెలిపారు. ఒక్కో గ్రామంలో రుణమాఫీ కానీ రైతుల వివరాలను పరిశీలించి, విచారణ జరుపుతామని, రైతులు సహకరించి వివరాల నమోదుకు సహకరించాలని కోరారు. కుటుంబ సభ్యుల అనుసంధానం కోసం సర్వే నిర్వహించడం జరుగుతుందన్నారు.

శంకరపట్నం: కేశవపట్నం రైతు వేదికలో బుధవారం వ్యవసాయ విస్తరణ అధికారులకు రుణమాఫీ కాని రైతులు దరఖాస్తులు అందించారు. గురువారం నుంచి సెప్టెంబర్ 11వరకు గ్రామాల వారీగా రుణమాఫీ కానీ రైతుల ఇంటికి వెళ్లి సర్వే చేస్తామని ఏవో వెంకటేశం తెలిపారు. గురువారం కాచాపూర్, రాజాపూర్, శుక్రవారం కన్నాపూర్, ధర్మారం, శనివారం గద్దపాక, కల్వల, సెప్టెంబర్ 2న తాడికల్, చింతగుట్ట, 3న ముత్తారం,మక్త, 4న మొలంగూర్,ఆముదాలపల్లి, 5న ఏరడపల్లి,అర్కండ్ల, 6న చింతలపల్లి, గొల్లపల్లి, కొత్తగట్టు, 9న మెట్‌పల్లి, లింగాపూర్, 10న అంబాల్‌పూర్, ఇప్పలపల్లి, కరీంపేట, 11న వంకాయగూడెం, కేశవపట్నం గ్రామాల్లో సర్వే చేయనున్నట్లు తెలిపారు.

హుజూరాబాద్‌రూరల్: రుణమాఫీ ఫిర్యాదులు అధికంగా కుటుంబ నిర్ధారణపై వచ్చాయని ఏడీఏ ఎ.సునీత తెలిపారు. వ్యవసాయాధికారి గ్రామాల వారీగా వస్తారని, రైతులు వివరాలు సరి చేసుకోవాలని తెలిపారు.

'హైడ్రా' జిల్లా, పట్టణ ప్రాంతాల్లో అమలు చేయాలి

చిగురుమామిడి: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన హైడ్రాను జిల్లా, పట్టణ ప్రాంతాల్లో అమలు చేయాలని మాజీ జెడ్పీటీసీ గీకురు రవీందర్ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం చిగురుమామిడిలో మాట్లాడారు. చెరువులు, కుంటలు, ప్రభుత్వ భూములను ఆక్రమించిన వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలన్నారు. అక్రమ కట్టడాల పట్ల ఉక్కుపాదం మోపడం పట్ల ప్రజలను హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయన్నారు. కోట్లు విలువ గల భూములను కాజేసిన భూబకాసురులపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రవేశపెట్టిన హైడ్రా చట్టానికి పార్టీలకు అతీతంగా అందరూ మద్దతు పలకాలని కోరారు.

ఆధ్యాత్మికం

ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



పల్లకి సేవ నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు

ఇల్లందకుంట: మండలకేంద్రంలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయంలో బుధవారం శ్రీ కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు శేషం రామాచార్యుల ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక అభిషేకం, పూజలు చేశారు. అనంతరం స్వామివారి ఉత్సవ విగ్రహాలను పల్లకిలో గ్రామవీధుల గుండా ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దర్శనం చేసుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఇన్‌చార్జి ఈవో కందుల సుధాకర్, సిబ్బంది మోహన్, మల్లారెడ్డి, ప్రవీణ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు

జమ్మికుంట: మున్సిపల్ పరిధి రామన్నపల్లి గ్రామంలో బుధవారం పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. మహిళలు నెత్తిన బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి తరలివెళ్లి అమ్మవారికి భక్తిశ్రద్ధలతో నైవేద్యం సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ హాజరయ్యారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ఊీందర్, మల్లయ్య, రాము, నాయకులురమేశ్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ మొగిలి, వెంకన్న, ఓదేలు, భద్రయ్య, మహేందర్, ప్రశాంత్, రాములు గ్రామస్తులు పాల్గొన్నారు.



ఉట్టి కొడుతున్న వొడితెల ప్రణవ్‌బాబు

నేడు సాయిబాబా ఆలయ వార్షికోత్సవం


తిమ్మాపూర్: మండలంలోని ఇందిరానగర్ సాయిబాబా ఆలయ 28వ వార్షికోత్సవం గురువారం నిర్వహించనున్నామని ఆలయ ప్రధాన అర్చకుడు ఉరమండ్ల కిరణ్‌శర్మ తెలిపారు. పంచామృతాభిషేకం, అఖండ లక్ష్మీనవగ్రహ హోమం, పూర్ణాహుతి, ఆశీర్వచనం, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు చేపడతామని వివరించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని ఆలయ కమిటీ చైర్మన్ కోరారు.

ఉట్టికొట్టి.. ఉత్సాహపరిచి..

హుజూరాబాద్‌రూరల్: నియోజకవర్గంలోని పలు మండలాల్లో బుధవారం కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ ఇన్‌చార్జి ప్రణవ్ పర్యటించారు. వివాహ వేడుకలు, పట్టణంలోని గాంధీనగర్‌లో ఉట్టికొట్టే కార్యక్రమంలో పాల్గొన్నారు. శ్రీకృష్ణ యూత్ అసోసియేషన్ సభ్యులు ప్రణవ్‌కు ఘనస్వాగతం పలికారు. అనంతరం చిన్న పిల్లలతో పాలవెల్లి కార్యక్రమంలో పాల్గొని ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు,పట్టణ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజు పశువుల తరలింపు

- కంటైనర్‌ను వెంబడించిన పోలీసులు
- వాహనంలో 28 పశువులు



గోశాల సమీపంలో పశువులు

తిమ్మాపూర్: అక్రమంగా తరలిస్తున్న పశువులను ఎల్ఎండీ పోలీసులు బుధవారం పట్టుకున్నారు. జయశంకర్‌భూపాలపల్లి జిల్లా కాటారం నుంచి హైదరాబాద్‌కు టీఎస్07యూజీ7580 నంబర్ కంటైనర్‌లో పశువులను తరలిస్తున్నారనే సమాచారంతో చిగురుమామిడి ఎస్సై రాజేశ్ వాహనాన్ని తనిఖీ చేసేందుకు యత్నించగా డ్రైవర్ ఆపకుండా వెళ్లిపోయాడు. దీంతో ఎస్సై కంటైనర్‌ను వెంబడించి గౌరారం పోలీసు స్టేషన్ సమీపంలో పట్టుకున్నారు. డ్రైవర్ ఆసిఫ్, సమీర్‌ను అదుపులోకి తీసుకుని ఎల్ఎండీ పోలీసులకు అప్పగించారు. వరుసగా రెండు రోజులు పశువులను తరలిస్తున్న వాహనాలు పట్టుపడగా పోలీసులకు పశువుల తరలింపు సవాల్‌గా మారింది. ఉన్నత అధికారులు సైతం సీరియస్‌గా ఉన్నట్లు సమాచారం. పట్టుకున్న వాహనంలోని 24 ఎద్దులు,4 ఆవులను మృత్యుంజయాలయం సమీపంలోని గిరిజా గోశాలకు తరలించారు. సోమవారం రాత్రి పట్టుబడిన పశువుల్లో రెండు నడవలేని స్థితిలో ఉన్నాయి, వీధి కుక్కలు దాడి చేయడంతో రెండు ఆవులు చనిపోయాయి. పశువుల పట్ల గోసంరక్షకులు, పోలీసులు అజాగ్రత్తగా ఉన్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పశువులను ఎవరూ తరలించుకుపోకుండా గన్నేరువరం ఎస్సై నరేశ్ బుధవారం బందోబస్తు నిర్వహించారు.

రైల్వే సమాచారం

జమ్మికుంట నుంచి ప్రతిరోజు నడిచే రైళ్ల సమాచారం

జమ్మికుంట నుంచి కరీంనగర్, బల్లార్షా(ఎగువ) వైపు..		
12761:	తిరుపతి-కరీంనగర్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్(గురు, ఆదివారాలు)	05.26 గంటలకు
17003:	రామగిరి ఎక్స్‌ప్రెస్-కాజీపేట్-సిర్పూర్ టౌన్	06.05 గంటలకు
17011:	ఇంటర్‌సిటి ఎక్స్‌ప్రెస్-హైదరాబాద్ టూ సిర్పూర్ కాగజ్‌నగర్	07.55 గంటలకు
17033:	సింగరేణి ఫాస్ట్ ప్యాసింజర్-భద్రాచలం రోడ్ టూ బల్లార్షా	10.01 గంటలకు
12757:	కాగజ్‌నగర్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్-సికింద్రాబాద్ టూ సిర్పూర్ కాగజ్‌నగర్	10.43 గంటలకు
12721:	దక్షిణ్ ఎక్స్‌ప్రెస్-హైదరాబాద్ టూ హజరాయ్ నిజామోద్దీన్	(రాత్రి)1.44 గంటలకు
12771:	రాయ్‌పూర్ ఎక్స్‌ప్రెస్-సికింద్రాబాద్ టూ రాయ్‌పూర్ జంక్షన్	(రాత్రి)1.04 గంటలకు
12791:	ధానాపూర్ ఎక్స్‌ప్రెస్-సికింద్రాబాద్ టూ ధానాపూర్	11.34 గంటలకు
16093:	లక్నో ఎక్స్‌ప్రెస్(బుధ, శని)-ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ టూ లక్నో జంక్షన్	18.08 గంటలకు
16031:	అండమాన్ ఎక్స్‌ప్రెస్(ఆది, బుధ, గురువారాలు)-ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ టూ లక్నో	18.08 గంటలకు
17233:	భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్-సికింద్రాబాద్ టూ సిర్పూర్ కాగజ్‌నగర్	18.25 గంటలకు
17035:	కాజీపేట్ బల్లార్షా ఎక్స్‌ప్రెస్-కాజీపేట్ టూ బల్లార్షా	23.18 గంటలకు
12592:	యశ్వంత్‌పూర్ టూ గోరఖ్‌పూర్ ఎక్స్‌ప్రెస్(మంగళవారం)	08.55 గంటలకు
జమ్మికుంట నుంచి కాజీపేట్, వరంగల్(దిగువ) వైపు..		
12772:	రాయ్‌పూర్ సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్-రాయ్‌పూర్ టూ సికింద్రాబాద్	04.11 గంటలకు
17234:	భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్-సిర్పూర్ కాగజ్‌నగర్ టూ సికింద్రాబాద్	05.44 గంటలకు
17036:	బల్లార్షా కాజీపేట్ ఎక్స్‌ప్రెస్-బల్లార్షా టూ కాజీపేట్	07.20 గంటలకు
17012:	ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్-సిర్పూర్ కాగజ్‌నగర్ టూ సికింద్రాబాద్	13.55 గంటలకు
17034:	సింగరేణి ఫాస్ట్ ప్యాసింజర్ సిర్పూర్‌టౌన్ టూ భద్రాచలం రోడ్	14.45 గంటలకు
16032:	అండమాన్ ఎక్స్‌ప్రెస్(ఆది, సోమ, గురు)-శ్రీమాతా వైష్ణోదేవి కత్రా టూ ఎంజీఆర్ చెన్నై సెంట్రల్	15.34 గంటలకు
16094:	లక్నో ఎక్స్‌ప్రెస్ (మంగళ, శుక్ర)-లక్నో జంక్షన్ టూ ఎంజీఆర్ చెన్నై సెంట్రల్	16.09 గంటలకు
12758:	కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్-సిర్పూర్ కాగజ్‌నగర్ టూ సికింద్రాబాద్	16.30 గంటలకు
12792:	సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్-దానాపూర్ టూ సికింద్రాబాద్ 1	7.42 గంటలకు
12722:	దక్షిణ్ ఎక్స్‌ప్రెస్-నిజామోద్దీన్ టూ హైదరాబాద్ జంక్షన్	23.19 గంటలకు
17004:	రామగిరి ఎక్స్‌ప్రెస్-బల్లార్షా టూ కాజీపేట్	19.09 గంటలకు
12762:	కరీంనగర్, తిరుపతి ఎక్స్‌ప్రెస్(గురు, ఆది) కరీంనగర్ టూ తిరుపతి	20.24 గంటలకు
12591:	గోరఖ్‌పూర్ టూ యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్(ఆదివారం)	10.09 గంటలకు

సంక్షిప్త వార్తలు

కాషాయ జెండా ఎగురవేయాలి

గన్నేరువరం: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో మండలంలో కాషాయ జెండాను ఎగురవేయాలని బీజేపీ మానకొండూర్ నియోజకవర్గ కన్వీనర్ ముత్యాల జగన్‌రెడ్డి అన్నారు. మండలకేంద్రంలో బుధవారం పార్టీ సభ్యత్వ నమోదు సమావేశం మండల అధ్యక్షుడు నగునూరి శంకర్ ఆధ్వర్యంలో నిర్వహించగా ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యకర్తలు ప్రత్యేక శ్రద్ధతో ప్రతి బూత్ నుంచి అధిక సభ్యత్వ నమోదు చేయించడంతో పాటు జిల్లాలో మండలాన్ని ప్రథమ స్థానం నిలపాలన్నారు. సంస్థాగతంగా పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మచ్చ బాలరాజు, మండల ప్రధాన కార్యదర్శులు పర్శరాములు, వెంకటేష్, సత్తయ్య, తిరుపతి, శ్రీనివాస్, రాములు, రాజు, మల్లేశం, రామచంద్రం, తిరుపతి, వేణు, స్వామి, సాకేత్, కృష్ణమూర్తి, రాజు, లచ్చయ్య, శ్రీనివాస్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, రాజిరెడ్డి, దేవరాజ్, హరీష్, సంజీవ్, లచ్చన్న, తిరుమల్, ప్రశాంత్, సంతోష్, వెంకటేశం పాల్గొన్నారు.

మట్టి తరలింపును అడ్డుకున్న రెవెన్యూ సిబ్బంది

గంగాధర: మండలంలోని మల్లాపూర్ రెవెన్యూ పరిధిలో ఉన్న వంటశాల గుట్ట నుంచి అక్రమంగా మట్టి తరలిస్తున్న వాహనాలను రెవెన్యూ సిబ్బంది బుధవారం సాయంత్రం అడ్డుకున్నారు. అనంతరం వాహనాలను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఆర్ఐలు బాలకిషన్, రాములు సమాచారం ప్రకారం మల్లాపూర్ శివారులోని వంటశాల గుట్ట నుంచి రెండు టిప్పర్లు, జేసీబీ వినియోగించి మట్టి తరలిస్తుండగా గ్రామస్తులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. తహసీల్దార్ అనుపమరావు ఆదేశాల మేరకు మట్టి తరలిస్తున్న ప్రదేశానికి చేరుకొని వాహనాలను పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

మల్యాలలో వైద్యశిబిరం

ఇల్లందకుంట: మండలకేంద్రంలోని ఆరోగ్యకేంద్రం పరిధిలో ఉన్న మల్యాల గ్రామంలో పీహెచ్‌సీ వైద్యులు తులసీదాస్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. జ్వరపీడితుల నుంచి రక్త నమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపించామని వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌వో శ్యామల, సూపర్‌వైజర్ శ్రీనివాస్, హెల్త్ అసిస్టెంట్ అరుణ, ఉమ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

జమ్మికుంట: వావిలాల పీహెచ్‌సీ పరిధి మండలంలోని కోరపల్లి గ్రామంలో డాక్టర్ హిమబిందు ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. 42 మందికి పరీక్షలు చేసి మందుల పంపిణీ చేశారు. ఇద్దరు జ్వర పీడితుల రక్త నమూనాలను సేకరించి వైద్య పరీక్షల కోసం ల్యాబ్‌కు పంపించారు. అనంతరం సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. హెల్త్ ఎడ్యుకేటర్ మోహన్‌రెడ్డి, ఏఎన్ఎంలు రజిత, హెల్త్ అసిస్టెంట్ నరేందర్, ఆశా కార్యకర్త ఇందిర సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

పంటల వివరాలు నమోదు చేసుకోవాలి

చొప్పదండి: రైతులు సాగు చేసిన పంటల వివరాలను నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి భాగ్యలక్ష్మి కోరారు. మండలంలోని గుమ్లాపూర్ గ్రామంలో బుధవారం రైతులు సాగు చేసిన వివిధ పంటలను సందర్శించారు. వరి, పత్తి పంటలతో పాటు గోదాముల్లోని స్టాక్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె రైతులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏవో వంశీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సైబర్‌నేరాలపై అవగాహన

శంకరపట్నం: మండలంలోని మొలంగూర్ గ్రామంలో బుధవారం రాత్రి సైబర్‌నేరాలు, మత్తుపదార్థాల అనార్థాలపై కేశవపట్నం ఎస్సై రవి అవగాహన చేశారు. యువత మత్తు పదార్థాలకు బానిసకావొద్దన్నారు. బ్యాంక్, వ్యక్తిగత వివరాలు అపరిచిత వ్యక్తులకు చెప్పవద్దన్నారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణపై సర్వే

జమ్మికుంట: మున్సిపల్ పరిధిలోని పాత మున్సిపల్ కార్యాలయం పక్కన ప్రభుత్వ భూమి సర్వే నెంబర్లు 467, పట్టా భూమి 654లపై తహసీల్దార్ రమేశ్ చేసిన ఫిర్యాదుల మేరకు రెవెన్యూ డివిజనల్ సర్వేయర్ ఫయాక్ అలీ, స్థానిక సర్వేయర్ మనోజ్ ఆధ్వర్యంలో బుధవారం సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల, టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ ఏరియా నుంచి మొదలుకుని పాత మున్సిపల్ కార్యాలయం వరకు అధికారులు సర్వే చేశారు. సర్వే పని జరిగిందని తుది నివేదికను డీఐ రిపోర్టు ఇవ్వాల్సి ఉందని, గురువారం పూర్తి స్థాయిలో నివేదిక వస్తుందని అనంతరం వివరాలు వెల్లడిస్తామని తహసీల్దార్ రమేశ్ వివరించారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తిప్పారపు సంపత్‌కు సన్మానం

హుజూరాబాద్: టీపీసీసీ ఎస్సీ డిపార్ట్‌మెంట్ అట్రాసిటీస్ విభాగానికి రాష్ట్ర ఇన్‌చార్జిగా నియమితులైన తిప్పారపు సంపత్‌ను బుధవారం పట్టణంలోని ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు తునికి వసంత్ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జాతీయ కమిటీ ఉపాధ్యక్షుడు రుద్రారపు రామచంద్రం మాదిగ మాట్లాడుతూ... దళితుల సమస్యల పట్ల నిరంతరం పోరాడుతున్న తిప్పారపు సంపత్ కృషి, పట్టుదలను కాంగ్రెస్ పార్టీ పెద్దలు గుర్తించి ఎస్సీ అట్రాసిటీస్ విభాగానికి రాష్ట్ర స్థాయిలో ఇన్‌చార్జిగా నియమించటం హర్షణీయమని, సంపత్ ద్వారా దళితులపై జరిగే వేధింపుల కేసులు త్వరగా పరిష్కారం అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యులు మారపల్లి శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి దేవునూరి రవీందర్ , కలవల మల్లయ్య, వేల్పుల రత్నం, రామారపు సదానందం, మిడిదొడ్డి రాజయ్య, వేల్పుల ప్రభాకర్, మోరే సతీష్, పాత రఘుపతి, ఇల్లందుల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



జమ్మికుంట: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో తెలంగాణ క్రిస్టియన్ జేఏసీ రాష్ట్ర సదస్సు వాల్‌పోస్టర్‌ను జేఏసీ చైర్మన్ జిలుకర రవికుమార్, కో చైర్మన్ మేకల సారయ్య, ఉమ్మడి కరీంనగర్ జిల్లా చైర్మన్ కుర్రి ఏలియా, ఉమ్మడి వరంగల్ జిల్లా చైర్మన్ చెరుకూరి రత్నంరాజు ఆధ్వర్యంలో బుధవారం ఆవిష్కరించారు. హైదరాబాద్‌లోని బషీర్‌బాగు ప్రెస్‌క్లబ్‌లో సెప్టెంబర్ 26న నిర్వహించే రాష్ట్ర సదస్సుకు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ఉద్యమంలో క్రిస్టియన్లు కీలక పాత్ర పోషించారని, సీఎం రేవంత్‌రెడ్డి క్రిస్టియన్‌లకు సంక్షేమ ఫలాలు అందించాలని కోరారు. పాస్టర్లు శ్యామ్‌సన్, సామ్యూల్, నెహెమ్యా, పాల్, జాన్, జాన్‌మార్క్ పాల్గొన్నారు.

క్రైం వార్తలు

దొంగను పట్టుకొని దేహశుద్ధి చేసిన ప్రయాణికులు

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం బస్టాండ్‌లో బుధవారం రాత్రి ప్రయాణికులు దొంగను పట్టుకొని దేహశుద్ధి చేశారు. వీణవంక మండలం ఘన్ముక్కుల గ్రామానికి చెందిన బొంగోని యాదమ్మ హన్మకొండ నుంచి వస్తూ కేశవపట్నం బస్టాండ్‌లో దిగింది. ఓ దొంగ యాదమ్మ బ్యాగ్‌ను లాక్కొని అందులోని నగదు, రెండు సెల్‌ఫోన్లు జేబులో వేసుకుంటూఉండగా ప్రయాణికులు గమనించి పట్టుకొని పిడిగుద్దులు గుద్దారు, అనంతరం దొంగను కేశవపట్నం పోలీసులకు అప్పగించారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

జమ్మికుంట: ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ వరంగంటి రవి తెలిపారు. మండలంలోని విలాసాగర్‌కు చెందిన ట్రాకర్ డ్రైవర్ ముంజాల సాయి, యాజమాని ముంజాల రాజేశ్ అనుమతి లేకుండా అక్రమంగా ట్రాక్టర్‌తో ఇసుక తరలిస్తున్న క్రమంలో పట్టణంలోని కొత్తపల్లి వద్ద పోలీసులు పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారని వివరించారు.

చొప్పదండి: ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని ట్రాక్టర్ ఓనర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గొల్లపల్లి అనూష తెలిపారు. మోతె గ్రామం నుంచి చొప్పదండి మీదుగా ఇతర గ్రామాలకు అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా పెట్రోలింగ్ పోలీసులు పట్టుకున్నారని వివరించారు.

కేసు నమోదు

చొప్పదండిలోని ఓ దాబాలో మద్యం సేవిస్తున్నవారు పోలీసులను చూసి పారిపోయారని ఎస్ఐ అనూష తెలిపారు. దాబా ఓనర్‌పై కేసు నమోదు చేశామన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత

పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను బాధితుడికి అప్పగించినట్లు ఎస్ఐ అనూష తెలిపారు. చొప్పదండికి చెందిన శంకర్ పది రోజుల క్రితం రూ.ఇరవై వేలకుపైగా విలువ చేసే సెల్‌ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయగా రికవరీ చేశామని బాధితుడికి అప్పగించామన్నారు.

తృటిలో తప్పిన ప్రమాదం

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం బస్టాండ్ ఆవరణలో బుధవారం త్రుటిలో ప్రమాదం తప్పింది. వరంగల్ నుంచి బాన్సువాడకు వెళ్తున్న బస్సు కేశవపట్నం బస్టాండ్‌లోకి వచ్చింది. ఓ ప్రయాణికుడు కదులుతున్న బస్సు ఫుట్‌రెస్ట్‌పై ఓ కాలును పెట్టి మరోకాలు పెట్టకపోవడంతో కిందపడిపోయాడు. అందరూ కేకలు వేయడంతో డ్రైవర్ బ్రేక్‌వేశాడు. దీంతో ఆ ప్రయాణికుడు స్వల్పగాయాలతో బయటపడ్డాడు.